ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



Q6 NEWS తెలుగు



మేడ్చల్ | గురువారం | 30.07.2026 | సంపుటి : 2 | సంచిక : 28 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు





## తెలంగాణ పోలీసు శాఖలో

# కొలువుల జాతర

### మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల

02

### ఆన్‌లైన్‌లో దరఖాస్తుల తేదీలు త్వరలో వెల్లడి

### తెలంగాణ పోలీసు నియామక మండలి

తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక (స్త్రజూతీఎ) మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ఫైర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది.



## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

### పర్యావరణ అనుముతులు చెల్లుబాటు

### సుప్రీంకోర్టులో ఉపశమనం

న్యూఢిల్లీ, జూలై 29 : తెలంగాణలోని పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీం కోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తి గా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్య త్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని

-మిగతా 2 లో..

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం



వాడీవేడీ చర్చలు.. విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు.

న్యూఢిల్లీ, జూలై 29 : దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశా లను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3–5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5–10 ఏళ్ల జైలు శిక్ష,

-మిగతా 2 లో..

విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం

పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదన్న జితేంద్ర సింగ్

బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా

## ‘వందేమాతరం’పై బిల్లును ఆమోదించిన రాజ్యసభ

అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్

04



జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు.




## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

### కాంగ్రెస్ బీఎల్‌ఏలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు.

-మిగతా 3 లో..



### వాయుగుండప్రభావంతో

## విస్తారంగా వర్షాలు

### జోరు వానలతో పొంగుతున్న వాగులు

తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, నదులు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంటలు నీటమునిగాయి. పలు చోట్ల వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జలాశయాలు నిండి పోయి జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలతో భూపాలపల్లి జిల్లా తడిసిముద్దవుతోంది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

03

## కాళేశ్వరంపై కేటీఆర్ మాటలు సిగ్గుచేటు

### వారి హయాంలోనే కట్టడం.. కూలడం చూశాం

దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




న్యూఢిల్లీ, జూలై 29 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹86

### ఉదయ్ కృష్ణారెడ్డిపై

## ఆరోపణలు నిజమే

తొలుత ప్రేమించుకున్న వీరు తరవాత దూరమయ్యారు

అయినా వేధింపులకు దిగిన ట్రైనీ ఐపీఎస్

నగర్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్, జూలై 29 : లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో కేసు నేపథ్యాన్ని సీపీ సజ్జనర్ వివరించారు. నిందితుడు, ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. అనంతరం యూపీఎస్సీ

-మిగతా 2 లో..



### దేవాదాయ శాఖలో మరోసారి

## పదోన్నతుల పండుగ

### 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి

ప్రభుత్వ పనితీరుకు దేవాదాయ శాఖ పనితీరే నిదర్శనం

ఉద్యోగుల హక్కులను కాపాడటంలో ముందుంటాం

దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే చర్య

ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు, రివార్డులు

02

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ





## నగదు లెక్కిస్తామని 15వేలతో ఉడాయింపు

### కామారెడ్డి జిల్లా బ్యాంకులో మహిళను మోసం చేసిన దొంగలు

కామారెడ్డి జిల్లాలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఓ మహిళను దొంగలు మోసం చేసి నగదు కాజేశారు. డబ్బులు లెక్కపెడతామని నమ్మించిన దుండగులు, మహిళ వద్ద ఉన్న నోట్ల కట్టలో నుంచి రూ.15 వేలను చాకచక్యంగా మాయం చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

03

జనం వార్త




## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ–పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ తదితరులు బిల్లుపై మాట్లాడారు.



## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.



## అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

### అధికారులతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 29 :** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ–సేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీ–సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఈ–గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ–సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీ–సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు డేటా ఆధారిత పరిష్కారాలను మీ–సేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈ–గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీ–సేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ–సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

- 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి
- ప్రభుత్వ పనితీరుకు దేవాదాయ శాఖ పనితీరే నిదర్శనం
- ఉద్యోగుల హక్కులను కాపాడటంలో ముందుంటాం
- దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే చర్య
- ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు, రివార్డులు
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూలై 29 :** దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. ఈ రోజు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతుల మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్వర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంలాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రానున్న పుష్కరాలు చేపడతామని మంత్రి సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖలో సంస్కరణల యుగానికి శ్రీకారం చుట్టామని, నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల సంక్షేమం, భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు.

రాబోయే రోజుల్లో దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తూ, దేవాదాయశాఖను మరో స్థాయిలో నిలబెట్టేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరపడడంతో ఈవోలుగా పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన గుర్తింపు లభించడంతో వారంతా మంత్రి కొండా సురేఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కాళేశ్వరంపై కేటీఆర్ మాటలు సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)



ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఎ÷–లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.


## ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమే

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యాడు. 2025 డిసెంబర్ నుంచి శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిందితుడికి బాధితురాలితో పరిచయం ఏర్పడింది. తన విజయ ప్రయాణంపై నిందితుడు చేసిన పోస్టుకు ఆమె స్పందించడంతో వీరి పరిచయం ప్రారంభమైంది. తాను కూడా 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని.. ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉండటంతో 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణలో చేరనున్నట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం ఇద్దరూ స్నేహితులయ్యారు. ఈ పరిచయం ప్రేమగా మారింది. ఎన్‌పీఏలో శిక్షణ పొందుతున్న సమయంలో వీరి సంబంధం మరింత బలపడింది. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్యా మనస్పర్థలు వచ్చాయి. నిందితుడు పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరి ధ్వంసం చేశాడు. ఆమె తనను బ్లాక్ చేసిన తర్వాత నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. వ్యక్తిగత చాట్‌లను బహిర్గతం చేస్తానని బెదిరించాడు. బాధితురాలి అనుమతి లేకుండా కుటుంబ సభ్యులు, సహచరులను సంప్రదించాడు. వేధింపులు పెరగడంతో బాధితురాలు అతడి నుంచి దూరంగా ఉంది. అనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. అయినా ఉదయ్ కృష్ణారెడ్డి వేధింపులు ఆగలేదు. కేసు దర్యాప్తులో ఉదయ్ కృష్ణారెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నిందితుడిని అరెస్ట్ చేసి ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచాం. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది. చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును దర్యాప్తు చేస్తోందని సజ్జనర్ పేర్కొన్నారు.

### కృష్ణారెడ్డికి 14రోజుల రిమాండ్

తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు మిర్యాలగూడలో మంగళవారం అదుపులోకి తీసుకుని ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. ఉదయ్ కృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉదయ్ కృష్ణారెడ్డిని బుధవారం ఉప్పర్ పల్లి కోర్టులో హాజరపరుచగా.. న్యాయమూర్తి అతడికి ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు భారీ భద్రత మధ్య చంచల్ గూడ జైలుకు తరలించారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై ఉదయ్‌కృష్ణారెడ్డి దాడి చేసినట్టు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయినట్టు తెలిసింది. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమెపై భౌతికంగా దాడి జరిగినట్టు తేల్చారు. బాధితురాలి గొంతు నులిమినట్టు గాయాల ఆనవాళ్లు సమాచారం.




## తెలంగాణ పోలీసు శాఖలో కొలువుల జాతర

### మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల

### ఆన్‌లైన్‌లో దరఖాస్తుల తేదీలు త్వరలో వెల్లడి

### తెలంగాణ పోలీసు నియామక మండలి

**హైదరాబాద్,జూలై 29 :** తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ఫైర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ రైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది. దరఖాస్తు చేసుకునే ముందే నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య, వైద్య ప్రమాణాలకు తాము తగినట్లుగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి సివిల్ సర్జన్‌తో పరీక్షించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడానికి తెలంగాణ ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉండేలా కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

## హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చివేత

### పెద్దలకు అండగా హైడ్రా పనితీరు : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్, జూలై 29 :** హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తీసివేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు. హైడ్రాకు అందమైన భాష్యం చెప్పి తమ ఇష్టాలకు అనుగుణంగా వాడుకుంటూ పెద్దల భూములు రక్షించుకుంటూ.. పేదల ఇండ్లు కూలగొడుతూ ఎంతో మందిని రోడ్డున పడేశారని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాకు ఈ విషయాలు వెల్లడించారు. ప్రజలను మభ్యపెట్టడం కోసమే లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కాపాడినట్లు రంగనాథ్ అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. దుర్గంచెరువు వద్ద ఉన్న నెక్టార్ గా÷–డ్గ÷న్స్, ఫాతిమా కాలేజ్ లాంటి వాటి జోలికి హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని మండిపడ్డారు. హిమాయత్ సాగర్, గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఇండ్ల వద్దకు హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని, కోర్టును తప్పుదోవ పట్టించారని విమర్శించారు. రంగనాథ్ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద సుమోటోగా స్వీకరించాలని కోరారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవడానికి హైడ్రా కూడా ఒక కారణం అని పేర్కొన్నారు. హైడ్రాను బ్లాక్ మెయిలింగ్‌కు సాధనంగా వాడుకోవటం సబబు కాదని, సీఎం, మంత్రులు అబద్ధాలు మాని పరిపాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. కేసీఆర్, బీఆర్ఎస్‌లను తలచుకుంటే వారికి నిద్ర పట్టడం లేదని అన్నారు. పాలన చేయకుండా నిత్యం కేసీఆర్‌ను తిట్టుకుంటూ ఎన్నాళ్లు పబ్బం గడుపుతారని వెల్లడించారు.

# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

## కాంగ్రెస్ బీఎల్‌ఏలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం



**న్యూఢిల్లీ, జూలై 29 :** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానెల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏలను నియమించినట్లు చెప్పారు. 50–60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హత గల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజనర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణ లో ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ – ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్టానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.



## పులుల సంరక్షణ మన బాధ్యత

### భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది

### అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ

**హైదరాబాద్,జూలై29 :** పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించు కుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో 'ప్రాజెక్ట్ టైగర్' ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. అడవులను కాపాడుకుందామని, వన్యప్రాణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ గారు పిలుపునిచ్చారు.

## బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే

# హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటుండ్రు

### ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం

### హైడ్రాపై కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్



**హైదరాబాద్, జూలై 29 :** హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## భార్య, అత్తమామల

# వేధింపులు

### సెల్ఫీ వీడియో తీసుకొని వ్యక్తి ఆత్మహత్య

**హైదరాబాద్, జూలై 29 :** భార్య, అత్తమామల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అంబర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అంబర్‌పేట్ డివిజన్ ఉమర్ నగర్‌లో సుల్తాన్ (44) అనే వ్యక్తి పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య అస్మా ఫరిన్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడి అత్త సబియా బేగం మామ షరీఫ్ నిజామాబాద్‌లో ఉంటారు. సుల్తాన్ పండ్ల వ్యాపారంలో వచ్చిన డబ్బులను తన కుమార్తె పేరు మీద పోస్ట్ ఆఫీస్‌లో వేయాలని, ప్రతి నెల 5 నుంచి 6 వేల రూపాయలు తన భార్యకు ఇస్తున్నట్లు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. కుమార్తె పేరు మీద డబ్బులు వేస్తున్నానని తన భార్య చెప్పడంతో ఆమెను నమ్మానని అన్నాడు. పోస్టాఫీస్‌కి వెళ్లి చూడగా కుమార్తె అకౌంట్లో కేవలం రూ. 6 వేలు మాత్రమే ఉన్నాయని సుల్తాన్ పేర్కొన్నాడు. అదే విధంగా నిజామాబాద్‌లో స్థలం కొనమని అత్తమామలకు రూ. 3 లక్షలు ఇవ్వగా వారు స్థలం కొనకుండా మోసం చేశారని అన్నాడు. పండ్ల వ్యాపారంలో 20 నుంచి 25 లక్షల రూపాయలు సంపాదించి.. తన భార్యకు ఇవ్వగా ఆమె డబ్బులు లేవని చెబుతోందని సుల్తాన్ వాపోయాడు. పైగా ఆమె అక్రమ సంబంధాలను కలిగి ఉందని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. డబ్బులు అడిగితే ఫరిన్, ఆమె తల్లిదండ్రులు తనను మానసికంగా వేధిస్తున్నారని, వారి వేదన భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని వీడియోలో పేర్కొన్నాడు. తన డబ్బులను పిల్లల పేరు మీద ఉంచాలని సుల్తాన్ వీడియోలో వెల్లడించాడు.

## బిజెపి ప్రాపకం కోసం కెటిఆర్ పాట్లు

### ఢిల్లీ పర్యటన మతలబు ముమ్మాటికీ అదే

### ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపణ



**హైదరాబాద్, జూలై 29 :** కేంద్ర మంత్రులను కలుస్తున్నాననే పేరుతో బీజేపీతో కెటిఆర్ రాయబారం నడుపుతున్నట్లు కనిపిస్తోందని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. కెటిఆర్ ఢిల్లీ పర్యటనపై వెంకట్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌కు ఢిల్లీలో అసలేం పనుందని ప్రశ్నించిన ఆయన.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు కోసమే ఢిల్లీలో చర్చలు జరుగుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్మెంట్ దొరక్కపోవడంతో తెలంగాణ అంశాల పేరుతో కేంద్ర మంత్రులను కలుస్తున్నట్లు కేటీఆర్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కెటిఆర్ పార్టీ మనుగడ కోసమే ఢిల్లీ వీధుల్లో తిరుగుతున్నారని వెంకట్ అన్నారు. కేసీఆర్ కోసం ఫామ్‌హౌస్‌లో డమ్మీ అసెంబ్లీ పెట్టే పరిస్థితి వస్తుందేమోనని ఎద్దేవా చేశారు. ఉదయం కేంద్ర మంత్రులను కలుస్తున్నానని చెప్పే కేటీఆర్.. రాత్రివేళ ఎవరిని కలుస్తున్నారో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఇప్పుడు ముగిసిన అధ్యాయమని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలనే ఆ పార్టీ కొనసాగిస్తోందని విమర్శించారు. కేసీఆర్ నుంచే పచ్చి అబద్ధాలు చెప్పే రాజకీయ సంస్కృతి బీఆర్ఎస్‌కు వచ్చిందని ఆరోపించారు. హైడ్రాపై చేస్తున్న విమర్శలను కూడా బల్మూరి వెంకట్ ఖండించారు. బఫర్ జోన్‌లో భూములు ఉంటే ఫిర్యాదు చేయాల్సిందేనని, హైడ్రాను కోర్టు తప్పుపట్టలేదని, కేవలం కమిషనర్ కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే వేల ఎకరాల ప్రభుత్వ భూములను, వేల కోట్ల విలువైన ఆస్తులను కాపాడిందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన కీలక పరిణామాలపై కేటీఆర్ స్పందించకుండా సంగ్రామ సభల పేరుతో అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలకు గత ప్రభుత్వంలో భద్రత కల్పించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ అవసరమైన భద్రత కల్పిస్తోందని, పెద్ది సుదర్శన్ రెడ్డి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక గ్రీన్ ఛానల్ కూడా ఏర్పాటుచేశారని పేర్కొన్నారు.



## నగదు లెక్కిస్తామని 15వేలతో ఉడాయింపు

### కామారెడ్డి జిల్లా బ్యాంకులో మహిళను మోసం చేసిన దొంగలు

**కామారెడ్డి, జూలై 29 :** కామారెడ్డి జిల్లాలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఓ మహిళను దొంగలు మోసం చేసి నగదు కాజేశారు. డబ్బులు లెక్కపెడతామని నమ్మించిన దుండగులు, మహిళ వద్ద ఉన్న నోట్ల కట్టలో నుంచి రూ.15 వేలను చాకచక్యంగా మాయం చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన పూజ అనే మహిళ బ్యాంకు పనుల నిమిత్తం కామారెడ్డిలోని ఎస్‌బీఐ శాఖకు వెళ్లింది. బ్యాంకులో నగదు లెక్కపెడుతున్న సమయంలో కొందరు వ్యక్తులు ఆమెను గమనించారు. అనంతరం ఆమె వద్దకు వెళ్లి డబ్బులను సరిగ్గా లెక్కపెడతామని, నోట్లను పరిశీలిస్తామని నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన పూజ తన వద్ద ఉన్న నగదును వారికి ఇచ్చింది. ఈ క్రమంలో దుండగులు ఏమాత్రం అనుమానం రాకుండా వ్యవహరించి, నోట్ల కట్టలో నుంచి రూ.15 వేల నగదును తీసేశారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత నగదు తక్కువగా ఉన్నట్లు గుర్తించిన బాధితురాలు మోసపోయానని గ్రహించింది. ఆమె ఫిర్యాదు మేరకు బ్యాంకులో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల వివరాలను సేకరిస్తున్నారు. బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే సమయంలో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని బాధితురాలికి పోలీసులు ధైర్యం చెప్పారు.

## గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

### చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు



**హైదరాబాద్, జూలై 29 :** రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. రి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.మావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు.



## వైభవంగా అంబర్‌పేట మహంకాళి బోనాలు

### ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు

**హైదరాబాద్,జూలై29 :** అంబర్‌పేట్ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 9న అంబర్ పేట్ మహంకాళి ఆలయంలో అమ్మవారి బోనాలు జరగనున్నందున ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి, ట్రాన్స్ కో, పోలీస్, జలమండలి, వైద్యారోగ్యశాఖ, కల్చరల్ డిపార్ట్ మెంట్ లు సమన్వయంతో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ బోనాలకు అధికసంఖ్యలో భక్తులు పాల్గొంటున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బోనాల ఉత్సవాలను తెలంగాణ ప్రజలు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారని, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరుగుతున్నాయని అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొ÷–టటెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, భక్తులకు సౌకర్యాల కల్పన, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయశాఖ పై, దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో శాసనమండలి సభ్యులు బల్మూర్ వెంకట్, బిసి సంక్షేమశాఖ కమిషనర్ బాలమాయదేవి, ఎస్ పిడిసిఎల్ ఎం.డి.జితేష్ వి.పాటిల్,సమాచార,పౌర సంబంధాలశాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, వాటర్ వర్క్స్ జిఎం, ఆర్టిసి ఇడి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వాయుగుండ ప్రభావంతో వర్షాలు

### పలు జిల్లాల్లో జోరుగా వానలు



**హైదారాబాద్,జూలై29 :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమబెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో మూడ్రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. అటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో మెదక్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్టు చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెం.మీ, మెదక్ జిల్లా చేగుంటలో 8.11 సెం.మీ, మెదక్‌లో 7.68 సెం.మీ, శంకరంపేటలో 6.71 సెం.మీ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పాలెంలలో 6.90 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 6.14 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వివరించారు. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, గురు, శుక్రవారాల్లోనూ బలమైన గాలుల కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఎల్ నినో కారణంగా జూన్, జూలైలో –49 సెం.మీ లోటు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడించాయి. నిరుడు ఇదే సమయానికి 33.3 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

# పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?



**పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమీ మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్ప పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు.**

క్రాకచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్ధతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి.

నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఓంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్‌టిఎ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి.

చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళ్లల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

# పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ



- రాహుల్ ఇడియట్ పదంపై సభలో గందరగోళం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపిలు
- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు.. భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బిజెపి ఎంపిల పిల్లలనే అడగండి చెబుతారు
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు




**న్యూఢిల్లీ, జూల 29 :** లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. విద్యార్థుల ఆందోళనపై లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమయంలో ఆయన ఉపయోగించిన ఓ పదంపై తీవ్ర దుమారం రేగింది. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై లోక్‌సభలో బుధవారం కూడా వాడీవేడి చర్చ కొనసాగించింది. ఈ చర్చలో భాగంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. యువత ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. వారి సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాయి. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ వంటి ఘటనలతో ఆందోళనకు గురయ్యారు. తీవ్ర వేదన తర్వాతే దిల్లీ వేదికగా నిరసనలు చేపట్టారు. శాంతియుత నిరసన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారు. ఆందోళన చేసిన వారితో నేను మాట్లాడాను. వారు చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు నాతో చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని బాధపడ్డారని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ ప్రసంగంపై భాజపా ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో అభ్యంతరకర మాటలు మాట్లాడుతున్నారని, విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో కేంద్రం, విపక్ష నేత మధ్య ఒకింత వాగ్వాదం నెలకొంది. దీంతో స్పీకర్ దాన్ని తొలగిం చారు. చదువు అనేది ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారింది. విద్యార్థుల కోసం నేడు తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెడుతు న్నారు. కానీ, విద్యావ్యవస్థ క్రూరంగా మారింది. ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోంది. ఇక, ఈ వ్యవస్థ నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమే. విద్యార్థులకు అసలైన శత్రువు ఈ సంస్థే. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటోంది. ఆఖరికీ వర్సిటీల్లోనూ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లనే వీసీలుగా నియమించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను కూడా అధికార సభ్యులు తీవ్రంగా ఖండించారు. అనంతరం విద్యార్థులపై పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. ఆందోళనకారులను అణచివేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. సభకు రావడానికి హోంమంత్రికి ధైర్యం లేదంటూ విమర్శించారు. దీంతో సభలో మరోసారి గందరగోళం నెలకొంది. రాహుల్ గాంధీ ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తున్నారు? అమిత్ షా పేరును ప్రస్తావించేందుకు ఆయన వద్ద ఏం ఆధారాలున్నాయి? రాహుల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. ఇకపోతే పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. కేంద్రం మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారని మండిపడ్డారు. మూర్ఖులు ఎవరి మాటలు వినరని.. ప్రభుత్వంలో ఉన్నవారు తమ ఆవేదనను పట్టించుకోరని విద్యార్థులు చెప్పారన్నారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగాన్ని బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారు. ఇడియట్స్ అనే పదాన్ని రాహుల్ వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహించారు. రాహుల్ తన భాషను మార్చుకోవాలని కిరణ్ రిజిజు అన్నారు. విద్యార్థుల పేరుతో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను ఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 'ఎమర్జెన్సీ' సమయంలో నిరసన చేస్తే.. నన్నూ అరెస్ట్ చేశారు

- పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారు
- ఖర్గే వ్యాఖ్యలను తిప్పికొట్టిన జేపీ నడ్డా



**న్యూఢిల్లీ,జూలై29 :** దిల్లీలో నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుబట్టారు. ఈ విషయంపై రాజ్యసభలో మాట్లాడుతూ.. అణచివేతకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు తాను కూడా చాలాసార్లు అరెస్టయినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించినప్పుడు పోలీసులు తనను తరగతి గదిలోనే అరెస్ట్ చేశారని వెల్లడించారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే ఏ విద్యార్థి అయినా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని నడ్డా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. సీజేపీకి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నందుకు పోలీసులు బుధవారం సీపీఎం ఆఫీస్‌పై దాడి చేశారని ఆ పార్టీ ఎంపీలు చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి ఖండించారు. దీంతో రాజ్యసభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.

## మద్యం కేసులో కారుమూరికి చుక్కెదురు

**ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ,జూలై29 :** ఏపీ మద్యం కుంభకోణం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. నేరం జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, ఈ కేసులో కస్టోడియల్ దర్యాప్తు అవసరమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏపీ మద్యం కుంభకోణంలో సుమారు రూ.350 కోట్ల ప్రజాధనం దారి మళ్లినట్లు ఆధారాలు ఉన్నాయని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితుడి విచారణ అవసరమని న్యాయస్థానం అభిప్రాయపడింది. కస్టోడియల్ దర్యాప్తు లేకుండా పూర్తిస్థాయిలో నిజాలను వెలికితీయడం కష్టమని పేర్కొంది. కారుమూరి నాగేశ్వరరావు తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్ కోసం వాదనలు వినిపించినప్పటికీ, సుప్రీంకోర్టు వాటిని పరిగణనలోకి తీసుకోలేదు.



## 'వందేమాతరం'పై బిల్లును ఆమోదించిన రాజ్యసభ

**అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్**

**న్యూఢిల్లీ, జూలై 29 :** జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల దిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని... దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అఠావలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు.

## భారత్ ఒక సజీవ సాంస్కృతిక వారసత్వం

**వందేమాతరం జాతీయ ఆత్మను ప్రతిబింబించే స్వరం**

**ఉద్వేగపూరిత ప్రసంగంతో ఆకట్టుకున్న టిడిపి ఎంపి విజయ్**



**న్యూఢిల్లీ, జూలై 29 :** రాజ్యసభలో దేశభక్తి, 'వందేమాతరం' విశిష్టతపై టీడీపీ ఎంపీ చింతకాయల విజయ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజ్యసభ సమావేశాల్లో 'నేషనల్ ఆనర్ అమెండ్‌మెంట్ బిల్లు'పై విజయ్ మాట్లాడుతూ.. ఈ క్షణం కేవలం ఓ వ్యక్తికి సంబంధించినది కాదని, ప్రజల నమ్మకానికి ప్రతీక అని అన్నారు. భారత ప్రజాస్వామ్య శక్తికి, జాతీయ ఆత్మను ప్రతిబింబించే 'వందేమాతరం' స్వరానికి ప్రతీకగా నిలిచే సందర్భమని అని పేర్కొన్నారు. భారతదేశం కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని.. ఇది ఒక సజీవమైన సాంస్కృతిక వారసత్వమని అభివర్ణించారు. ఇది వందన, అభినందన, అర్పణ, తర్పణ భూమి అని ఉద్ఘాటించారు. దేశంలో పారే ప్రతి నది గంగతో.. ప్రతి రాయి శంకరునితో సమానమని పేర్కొన్నారు. 'మనం జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే... చివరికి మన అస్థికలు గంగాజలంలో కొట్టుకు పోతున్నప్పుడు ఎవరు చెవిపెట్టి విన్నా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అనే శబ్దాలే వినిపిస్తాయి' అని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో 'వందేమాతరం' తెచ్చిన స్ఫూర్తిని, త్యాగాలను ఈ సందర్భంగా ఎంపీ విజయ్ గుర్తు చేసుకున్నారు. 1875లో బంకించంద్ర ఛటర్జీ రూపొందించిన 'వందేమాతరం' అనే రెండు పదాలు కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించాయని అన్నారు. 1908లో కేవలం 18 సంవత్సరాల వయస్సులోనే ఖుదీరామ్ బోస్ ఉరికంభాన్ని ఎక్కుతూ 'వందేమాతరం' అని గర్జించారని గుర్తుచేశారు. అలాగే కాలాపానీ సెల్యులార్ జైలులో వీర్ సావర్కర్ క్రూరమైన చిత్రహింసలను తట్టుకుంటూ 'వందేమాతరం' అని బదులిచ్చారని తెలిపారు. ఆల్ఫ్రెడ్ పార్క్‌లో చంద్రశేఖర్ ఆజాద్ లొంగిపోకుండా ప్రాణాలర్పించే సమయంలోనూ ఇదే నినాదాన్ని పలికారన్నారని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సీపట్నం ప్రాంతానికి చెందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని ఈ సందర్భంగా చింతకాయల విజయ్ స్మరించుకున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యం.. అల్లూరిని చెట్టుకు కట్టేసి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపినప్పుడు కూడా ఆయన నోటి నుంచి వచ్చిన చివరి మాట 'వందేమాతరం' అని గుర్తుచేశారు. ఈ విప్లవ వీరుని త్యాగానికి గౌరవంగా ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అల్లూరి సీతారామరాజుకు శిరస్సు వంచి ప్రణామాలు అర్పించారని కొనియాడారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ రాసిన 'బాధాయే ఆతీ హై ఆయే' అనే ప్రసిద్ధ కవితా పంక్తులను సభలో ప్రస్తావిస్తూ.. ఎంతటి ఆటంకాలు వచ్చినా, అగ్నిజ్వాలలు ఎదురైనా అడుగులో అడుగు వేసి ముందుకు సాగాలని ఎంపీ పిలుపునిచ్చారు. అందరం కలిసికట్టుగా ముందుకు సాగినప్పుడే దేశం పురోగమిస్తుందని స్పష్టం చేశారు.



## దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి: ఆర్డీఓకు వినతి

**నాగర్‌కర్నూల్, జూలై 29(జనం వార్త) :** గుడిపల్లి రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులపై దాడి చేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ నాగర్‌కర్నూల్ మండలం మత్స్యకారులు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జూలై 25న గుడిపల్లి రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన తమపై నల్గొండ జిల్లా సర్వేపల్లి గ్రామ సర్పంచ్ రాములు మరియు అతని అనుచరులు అక్రమంగా దాడి చేసి గాయపరిచారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రాణహాని కలిగిస్తామని బెదిరించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మత్స్యకారులను దూషించారని తెలిపారు. ఈ ఘటనపై నిందితులపై సెక్షన్లు 115(1), 118(1), 351(2), 352, 126(1), 189(2)లతో పాటు రాజ/రూ (గ్రాతీవజవత్‌అశీఅ శీట-చాతీశీఏఉఅవం)-చావ్‌లోని వర్తించే నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రధాన నిందితుడు సర్పంచ్ రాములు సహా బాధ్యులందరినీ వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు తమ డిమాండ్లపై వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో మత్స్యకారుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## డాక్టర్ హేమ రాజ్ సింగ్‌కు సన్మానం

**దుబ్బాక ప్రతినిధి జూలై 29 (జనం వార్త) :** దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ గా సేవలందిస్తున్న డాక్టర్ హేమరాజ్ సింగ్ కి ఇటీవల ఉత్తమ డాక్టర్ అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ హేమరాజ్ ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులు పాల్గొన్నారు





## ప్రతిభకు ప్రోత్సాహమే నిజమైన గౌరవం

### కళాకారిణి రేవతిని సన్మానించిన మారబోయిన రవి యాదవ్

**శేరిలింగంపల్లి, జులై 29(జనం వార్త):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని, నీటి పాత్రపై కేటీఆర్ చిత్రాన్ని అద్భుతంగా చిత్రించి తన విశిష్ట కళా నైపుణ్యాన్ని ప్రదర్శించిన యువ కళాకారిణి రేవతిని బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మసీద్‌బండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని అన్నారు. సాధారణ వస్తువుపై అసాధారణ కళాఖండాన్ని ఆవిష్కరించి అందరి ప్రశంసలు అందుకున్న రేవతి ప్రతిభ అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి కళాకారులకు ప్రోత్సాహం లభిస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కళాకారిణి రేవతికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఆమె ప్రతిభను అభినందించిన మారబోయిన రవి యాదవ్, భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన కళాఖండాలతో రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రేవతికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# దుబ్బాక అభివృద్ధికి సహకరించని అధికారులను ఉపేక్షించేది లేదు


- జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికైనా వెనుకాడం
- ప్రజా సమస్యల పరిష్కారమే సమీక్ష సమావేశాల ప్రధాన ఉద్దేశం
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు
- ప్రతి గ్రామంలో విద్యుత్, తాగునీరు, విద్య, వైద్య సేవలు మెరుగుపడాలి
- దుబ్బాక మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**దుబ్బాక జూలై 29(జనం వార్త) :** దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో దుబ్బాక మండలానికి చెందిన సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్యుత్, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్య, వైద్యం తదితర శాఖల పనితీరును శాఖల వారీగా సమీక్షించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రైతులు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో అడిగి తెలుసుకున్నారు. రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించాలని అధికారులతో పాటు ఏఈఓలు, సర్పంచులకు సూచించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు తాను కూడా తన సొంత 12 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తానని ప్రకటించారు. రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉండకూడదని ఆదేశించారు. డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని సర్పంచులు, రైతులు ఫిర్యాదు చేయడంతో వెంటనే జిల్లా అధికారులకు ఫోన్ చేసి సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని, ప్రతి గ్రామానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను నియంత్రించే సౌకర్యం కల్పించాలని సూచించారు. విద్యుత్ పనుల పేరుతో చెట్లను నరికి రోడ్లపై వదిలేయడం బాధ్యతారాహిత్యమని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాత విద్యుత్ స్తంభాలు, వైర్లను వెంటనే మార్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పరిధిలో గ్రామాల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని, ప్రతి ఇంటి వద్ద నీటి వృథాను అరికట్టేందుకు సర్పంచులు, సెక్రటరీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బోర్ల ద్వారా వచ్చే నీరు, విద్యుత్ వృథా కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. హౌసింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న బిల్లుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు అందేలా నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బెంచీలు, బల్లలు లేని పాఠశాలలకు వెంటనే అవసరమైన సామగ్రి అందించాలని, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య శాఖ అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అవసరమైన సిబ్బంది కొరతను తీర్చేందుకు స్థానిక సంస్థల సహకారంతో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ దుబ్బాక అభివృద్ధికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కోసం ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేకంగా కృషి చేసినందుకు ఆయనను అభినందించారు. చివరగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమీక్షా సమావేశాల ప్రధాన ఉద్దేశం ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించడమేనని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, కాలువల ద్వారా నేడు రైతులకు సాగునీరు అందడం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. దుబ్బాక అభివృద్ధి విషయంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎమ్మెల్యే తీవ్ర హెచ్చరిక చేశారు. జిల్లా కలెక్టర్ నుంచి కింది స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడించేందుకు వెనుకాడబోమన్నారు. అయినా పరిస్థితి మారకపోతే ఉద్యమాల గడ్డ దుబ్బాక శక్తి ఏమిటో మరోసారి చూపించే పరిస్థితి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. ప్రజల అభివృద్ధే తమ లక్ష్యమని, అందుకు ఎవరు అడ్డొచ్చినా ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## రఘునాథపురం వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా గురుపూజ మహోత్సవం

**రాజపేట, జులై 29 ( జనం వార్త ) :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురంలో కోరికలు తీర్చే శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో, ముందుగా శ్రీ శ్రీ శ్రీ భగవద్ రామానుజుల మూర్తికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి గురుపూజ మహోత్సవం రఘునాథపురం వికాస తరంగిణి సభ్యులు శ్రీ స్వామివారి శిష్య బృందం ,ఆలయ కమిటీ సభ్యులు ,భక్తులచే, ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాసచార్యులు గురుపూజ మహోత్సవం అత్యంత వైభవపేతంగా ఘనంగా నిర్వహించారు అనంతరం శ్రీ స్వామి వారికి నైవేద్య నివేదనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు అనంతరం





అన్న ప్రసాద వితరణ కార్యక్రమం శ్రీ స్వామివారి శిష్య బృందం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీ వెంకటేశ్వర భజన మండలి భక్త బృందం సభ్యులు, శివరామకృష్ణ భజన మండలి భక్త బృందం సభ్యులు , వికాస తరంగిణి అధ్యక్షులు భోగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి, బల్ల నరహరి, వికాస తరంగిణి సభ్యులు, మాదూరి బాలయ్య, బల్ల నాగభూషణం, సామల భాస్కర్, కటకం సంతోష్, భోగ వెంకటేశం, కల్లూరి అరుణమ్మ, మాదూరి సునంద, కుందారపు ఉమా, పొట్టబత్తిని వెంకటేశం, కటకం శ్రీనివాస్, చెన్న బాలా సిద్ధులు తదితరులు పాల్గొన్నారు







## గురుపౌర్ణమి ఆధ్యాత్మికతకు, గురుభక్తికి ప్రతీక

### మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, జులై 29(జనం వార్త):** గురుపౌర్ణమి ఆధ్యాత్మికతకు, గురుభక్తికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. బుధవారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్పలోని శ్రీ షిర్డీ సాయినాథ, మార్కండేయ స్వామి, సంతాన నాగదేవత ఆలయాల్లో మాజీ చైర్‌పర్సన్, తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్‌పర్సన్ సుజాత యాదవ్, శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సొంత ఖర్చులతో నిర్మించిన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాగం మాట్లాడుతూ గురుపౌర్ణమి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. గురువుల ఆశీస్సులతో ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని, శేరిలింగంపల్లి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సుభిక్షంగా జీవించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించిన రాగం నాగేందర్ యాదవ్, భక్తులకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులకు పెరుగుతున్న ఆదరణ

### ఆదర్శంగా మాదపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

- 20 నుంచి 143కు చేరిన విద్యార్థుల సంఖ్య
- ఉపాధ్యాయుల కృషితోనే ఈ ఘనత
- పాఠశాలను సందర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**దేవరుప్పుల :** రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు ఆదరణ పెరుగుతోందని, ఇందుకు దేవరుప్పుల మండలం మాదపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) నిదర్శనమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మాదపురం పాఠశాలను ఆమె బుధవారం సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్లే మాదపురం ఎంపీపీఎస్ జిల్లాలో ఉత్తమ ఆదర్శ పాఠశాలగా గుర్తింపు పొందిందని అభినందించారు. గతంలో కేవలం 20 మంది విద్యార్థులతో ఉన్న ఈ పాఠశాలలో, నేడు 143 మంది విద్యాభ్యాసం చేస్తుండటం ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు పెరుగుతున్న విశ్వాసానికి అద్దం పడుతోందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల అంకితభావమే ఈ విజయానికి ప్రధాన కారణమని కొనియాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం



విశేష సేవలందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎన్‌సీ లేజర్ యంత్రంలో చిక్కుకుని కార్మికుడు మృతి



**ఉప్పల్ :** కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో ఉన్న సుదర్శన్ ఐరన్ ఫాబ్రికేషన్స్ కంపెనీలో బుధవారం జరిగిన పారిశ్రామిక ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కంపెనీలోని సీఎన్‌సీ లేజర్ యంత్రం వద్ద విధులు నిర్వహిస్తున్న బత్తుల సురేష్ బాబు (42) ప్రమాదవశాత్తు యంత్రంలో చిక్కుకుని తీవ్ర గాయాల పాలయ్యాడు. సహచరులు బయటకు తీసేలోపే అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చర్లపల్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఫ్యాక్టరీలో విషాదఛాయలు అలుముకోగా, పారిశ్రామిక సంస్థల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రకృతితో సామరస్యంగా జీవించాలి

- అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యం
- మానవ, ఏనుగు సంఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారంగా గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్
- రైతుల పంటలు, ప్రజల ప్రాణాలకు రక్షణకు కీలక ముందడుగు
- గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్

**అమరావతి, జులై 29 :** ప్రకృతి మనకు చెందినది కాదు... మనమే ప్రకృతికి చెందినవాళ్లం. అందుకే ప్రకృతితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణపైనా ప్రభుత్వానికి బాధ్యత ఉంది. అదే దృక్పథంతో మానవ, ఏనుగు సంఘర్షణలను తగ్గించడానికి గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామ'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గుచ్చిమిలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని పవన్ కళ్యాణ్ బుధవారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. అడవి ఏనుగుల సంచారాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను రక్షించడం, దశాబ్దాల నుంచి ఉన్న మానవ?ఏనుగు సంఘర్షణను నివారించడమే లక్ష్యంగా ఈ శిబిరం పని చేయనుంది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించడం, రైతుల పంటలను ధ్వంసం చేయడం, ప్రజలు రాత్రివేళ భయాందోళనల మధ్య జీవించడం వంటి సమస్యలు పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా కాలంగా కొనసాగుతున్నాయి. ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నప్పుడు పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, కొంత మంది స్థానిక ప్రజలు సమస్యను నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యతగా భావించి గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేశాం. ఉత్తరాంధ్రలో మానవ, ఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. గతంలో పలమనేరు ప్రాంతంలో చేపట్టిన క్లిష్టమైన ఆపరేషన్లలో కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుతో పాటు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థంగా పని చేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా మానవ?ఏనుగు సంఘర్షణల కారణంగా సంభవించే మరణాలను 70 శాతానికి పైగా తగ్గించడంతోపాటు, పంట నష్టాలను కూడా గణనీయంగా తగ్గించగలిగారు. అదే విజయాన్ని ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. మనుషులు, ఏనుగులు మధ్య సామరస్య సహజీవనానికి వేదికగా ఈ గుచ్చిమి ఏనుగుల క్యాంప్ నిలవాలనే ఆశతో దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నాను. కర్ణాటక ప్రజలు, ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలుపార్వతీపురం జిల్లాలో ఈ రోజు మనం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామంటే దానికి ప్రధాన కారణం కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలు అందించిన సహకారం. మన విజ్ఞప్తిని గౌరవించి, ఎంతో ఆప్యాయతతో నాలుగు కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించడం వారి గొప్ప మనసుకు, స్నేహభావానికి నిదర్శనం. ఏనుగులను ఇవ్వడం అనేది సంపద ఇచ్చినట్లు అక్కడ ప్రజలు భావిస్తారు.

అయినా తెలుగు ప్రజల రక్షణ కోసం ప్రేమతో కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించిన కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డి కె శివకుమార్ కి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, అప్పటి అటవీశాఖ మంత్రి, ప్రస్తుత పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. వారి సహకారం, స్నేహభావం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత పెంచాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర, పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, శాసన సభ విప్ తోయక జగదీశ్వరి, అటవీ పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నందిని సలారియా, విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ.కె.వి.రాజు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా అటవీ అధికారి ప్రసూన పాల్గొన్నారు.



## అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం

- "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- తూర్పు కనుమల్లోని ఉబ్బలమడుగు జలపాతం ప్రాంతంలో గుర్తించిన కొత్త వృక్ష జాతి

**అమరావతి, జులై 29 :** తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. యూఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టారు. ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్ తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.



## జీవ వైవిధ్యంలో పులుల పాత్ర కీలకం

**అంతర్జాతీయ పులుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్**

**అమరావతి, జూలై 29 :** జీవ వైవిధ్య పరిరక్షణలో పులుల పాత్ర అమోఘమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. అడవుల పరిరక్షణలో భాగస్వాములైన ప్రకృతి ప్రేమికులందరికీ అంతర్జాతీయ పులుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పులుల సంరక్షణలో దేశానికే ఆదర్శంగా ఏపీని నిలిపామని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పోస్టు పెట్టారు. తూర్పు కనుమల్లో పులుల పునరుజ్జీవం వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. నల్లమలలో పులి గర్జన శాశ్వతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. పులి కేవలం మన జాతీయ జంతువు మాత్రమే కాదని, మన దేశ అటవీ సంపదకు, జీవ వైవిధ్యానికి, పర్యావరణ సమతుల్యతకు ప్రతీక అని ఉద్ఘాటించారు. ప్రపంచ పులుల దినోత్సవం 2010లో పులుల సంరక్షణ కోసం అంతర్జాతీయ సమాజం తీసుకున్న సంకల్పాన్ని మనకు గుర్తు చేస్తుందని తెలిపారు. అదే సమయంలో పులుల పరిరక్షణలో మన దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన తీరును గుర్తు చేస్తుందని అన్నారు. 'ప్రాజెక్ట్ టైగర్' వంటి దూరదృష్టితో కూడిన కార్యక్రమాల ఫలితంగా నేడు ప్రపంచంలోని పులుల్లో దాదాపు 75 శాతం మన దేశంలో నివసిస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశం సాధించిన అపూర్వ పర్యావరణ విజయానికి నిదర్శనమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.



## మంగినపూడి బీచ్ రోడ్డుకు అనుమతించండి

**కేంద్రమంత్రి గడ్కరీని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర**

**న్యూఢిల్లీ, జూలై 29 :** బందరు పోర్టు నుంచి మంగినపూడి బీచ్ మీదుగా రోడ్డు నిర్మాణానికి అనుమతించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. ఈ సమావేశంలో చర్చించిన విషయాల గురించి మీడియాకు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.150 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించాలని మంత్రి సూచించారు. ప్రతిపాదిత రోడ్డు ప్రభుత్వ భూముల గుండా వెళ్తున్నందున భూసేకరణ సమస్య లేదని తెలిపారు. ఈ రోడ్డు పూర్తి అయితే జాతీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా మారుతుందని చెప్పుకొచ్చారు. పోర్ట్ ద్వారా ఎగుమతి, దిగుమతి, కంటైనర్ ట్రాఫిక్ ఊపందుకుంటుందని వెల్లడించారు. మచిలీపట్నం ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ పార్కులు, క్లస్టర్‌లకు సానుకూలంగా మారుతుందని మంత్రి వివరించారు. మంగినపూడి బీచ్‌కు రోడ్డు సదుపాయం పెరిగితే పర్యాటకాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మచిలీపట్నం నుంచి బంటుమిల్లి వరకు 20 కిలోమీటర్ల రోడ్డుకు ఆమోదం తెలపాలని విన్నవించారు. ఈ రోడ్డు పూర్తయితే పోర్టు, పారిశ్రామిక, పర్యాటక, లాజిస్టిక్స్ అభివృద్ధికి ప్రయోజనమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.



## సీపీఐ పాదయాత్రలు జయప్రదం చేయండి

**సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య.**

**ఏలూరు, జూలై 29 :** కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక పాలననునిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆగస్టు 6 నుంచి 15 వ తేదీ వరకునిర్వహిస్తున్న పాదయాత్రలు, ప్రచార ఆందోళనలు, సెప్టెంబరు 1 న 'చలో దిల్లీ' కార్యక్రమాన్నిజయప్రదం చేయాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు.స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆయన కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికలను బుధవారం నాడు ఆవిష్కరించారు.ఈసందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా బీజేపీ అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం, సుపరిపాలన, మెరుగైన భవిష్యత్ అందిస్తామనివాగ్దానం చేసిందన్నారు. కానీ నేడు దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, భరించలేనిద్రవ్యోల్బణం, విస్తరిస్తున్న అసమానతలు,బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ,కుచించుకుపోతున్న ప్రజాస్వామ్యం,పెరిగిపోతున్న సామాజిక ఉద్రిక్తతలనుఎదుర్కొంటోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో ప్రజలకు చేసింది ఏమీ లేకపోయినా ఇంటింటికి టిడిపి పేరుతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం చేపట్టారని, ఏం సాధించారని ఈ కార్యక్రమం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంటింటికి తిరిగే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిలదీయాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారా లేదా అనేది కూడా ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పేలా ప్రశ్నించాలన్నారు. జిల్లాలో మెట్ట ప్రాంత వరప్రదాయిని చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తక్షణం పూర్తి చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మౌనిక సదుపాయాలు తో కూడిన పునరావాస కాలనీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## టిటిడి పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

**నకిలీ వెబ్‌సైట్ గుర్తించిన టిటిడి అధికారులు**

**తిరుమల, జూలై 29 :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పేరుతో సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా ఫేక్ వెబ్‌సైట్ రూపొందించి, భక్తులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి, అర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ భక్తులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఈ ఫేక్ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసేందుకు ప్రయత్నించే భక్తుల నుంచి వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం, ఆన్‌లైన్ చెల్లింపులు సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా డిజైన్ చేయడంతో చాలామంది భక్తులు ఇది అసలైన వెబ్‌సైట్‌గా భావించి మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇలాంటి నకిలీ వెబ్‌సైట్ల విషయంలో ఇప్పటికే పలుమార్లు టీటీడీ భక్తులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. వేంకటేశ్వర స్వామి దర్శనం, అర్జిత సేవలు, వసతి, శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు వంటి అన్ని బుకింగ్‌లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక యాప్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, తెలియని లింకులు, అనధికార వెబ్‌సైట్లను నమ్మొద్దని టీటీడీ అధికారులు సూచించారు. వెబ్‌సైట్ అడ్రస్‌ను ఒకటికి రెండు సార్లు పరిశీలించి మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వెబ్‌సైట్లు లేదా లింకులు కనిపిస్తే వెంటనే టీటీడీ అధికారులకు లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. భక్తులు అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి సైబర్ మోసాల నుంచి బయటపడవచ్చని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.



## రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత నష్టపెట్టొద్దు : మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి, జులై 29 :** మిత్రపక్షంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. రాజకీయ నాయకుడిగా రైతుల శ్రేయస్సు కోరుకోవడం ప్రధాన లక్షణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు మేలు చేసే సహేతుకమైన, నిర్మాణాత్మకమైన సలహాలను ఏ రాజకీయ పార్టీ నుంచి వచ్చినా ప్రభుత్వం తప్పకుండా స్వాగతిస్తుందని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతుల సమస్యలపై సక్రమంగా స్పందిస్తూ, వారికి అండగా నిలుస్తున్న సమయంలో నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని హితవు పలికారు.పొగాకు రైతులను గతంలోనూ.. ఇప్పుడూ.. సక్రమంగా ఆదుకున్నది తెదేపా, కూటమి ప్రభుత్వాలేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 2014-15లో తొలిసారిగా ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు కేజీకి రూ.20 చొప్పున ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 11 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని గుర్తించి గతంలో హెచ్‌డీ బర్లీ పొగాకును 25 మిలియన్ కేజీల మేర రూ.270 కోట్లతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని మంత్రి తెలిపారు. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు.ప్రస్తుతం అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, బ్రెజిల్, టాంజానియా వంటి దేశాల నుంచి తక్కువ ధరలకు పొగాకు అందుబాటులో ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అచ్చెన్నాయుడు వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, మరోవైపు పొగాకు వ్యాపారులు, కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చి రైతుల నుంచి కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు కూడా ప్రభుత్వం చేసిన ప్రయత్నం సఫలీకృతమైందని చెప్పారు.ఎన్ని ఆర్థికపరమైన ఒత్తిళ్లు, ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్రాన్ని ఒప్పించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పొగాకు రైతులకు కేజీకి రూ.20 చొప్పున సాయం అందించేలా చర్యలు చేపట్టాం. 94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు రూ.188 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం చేశాం. అతి కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.




## మహిళా కోర్టును ఆశ్రయించిన జోగి కుటుంబ సభ్యులు

**విజయవాడ, జూలై 29 :** తమను అరెస్ట్ చేయొద్దంటూ మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేశ్ కుటుంబ సభ్యులు విజయవాడ మహిళా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వరకట్న వేధింపులు, హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన మహిళా కోర్టు.. కౌంటరు దాఖలు చేయాలని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. జోగి రమేశ్, ఆయన కుటుంబసభ్యులపై ఆయన పెద్ద కోడలు జోగి మేఘన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో హత్యాయత్నం, గృహహింస, వరకట్న నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులుగా జోగి రమేష్, అతని సోదరుడు రాము, సోదరి రమ కుటుంబసభ్యులు 11 మందిని చేర్చారు. జోగి రాజీవ్, రమేష్, శకుంతల, రోహిత్, ప్రియాంక, జోగి రాము, అతని ఇద్దరు కుమారులు రాకేష్, పాండు, స్వామి, రమ, సాయి పేర్లను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

## శ్రీ ఓంకారాశ్రమంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**నారాయణపేట, జూలై 29 :** నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడేబల్లూరు టైరోడ్డు సమీపంలోని కృష్ణానది తీరం ఉన్న శ్రీ ఓంకారాశ్రమంలో బుధవారం గురుపౌర్ణమి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఓంకారానందగిరి గురువును దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా గురుపూజ, పాదసేవ, ధ్యానం, భగవద్గీత పారాయణం, భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురువు శిష్యురాలు శివ చైతన్యానంద రచించిన భక్తి గీతాల సీడీని ఆవిష్కరించారు. అదేవిధంగా శ్రీ ఓంకారాశ్రమం అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఓంకారానంద స్వామి మాట్లాడుతూ గురువు చూపే మార్గమే మనిషిని అజ్ఞానాంధకారం నుంచి జ్ఞాన వెలుగులోకి నడిపిస్తుందని అన్నారు. గురువు బోధలను ఆచరణలో పెట్టినవారే నిజమైన శిష్యులని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఎల్కోటి నారాయణరెడ్డి, విఠోబా, శివన్న గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా ఐటిఐలలో రెండవ విడత అడ్మిషన్లు

**విజయవాడ, జులై 29 :** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఐ.టి.ఐ లలో 2026-27/28 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 6వ తేదీన విజయవాడలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ ఆధారంగా నిర్ణీత తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐ.టి.ఐ లలో ప్రవేశం పొందే వారిలో ఎస్.సి., ఎస్.టి. అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరీల అభ్యర్థులు రూ. 60/- కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ప్రైవేటు ఐ.టి.ఐ లలో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ సమాచారం కోసం విజయవాడ ప్రభుత్వ ఐ.టి.ఐ లోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చునన్నారు.ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, లేదా 77804 29468 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ ఆ ప్రకటనలో తెలిపారు

# బీఎండబ్ల్యూలో 8000 ఉద్యోగాల కోత!

ప్రముఖ ప్రీమియం కార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యూ భారీగా లేఆఫ్‌లకు సిద్ధమవుతోంది. జర్మనీలోని తమ సంస్థలో దాదాపు 8 వేల ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. తొలగించిన వారికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్యాకేజీ ఇవ్వనున్నారు. కంపెనీ కార్ల డిమాండ్ తగ్గడంతో వ్యయాల భారాన్ని తగ్గించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. జర్మనీలోని 8 వేల మందిని ఉద్యోగులను 2027 చివరినాటికి తొలగించే అవకాశం ఉంది. ఇది ఆ సంస్థ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో సుమారు 5 శాతం. ఉద్యోగుల తొలగింపు ఈ ఏడాది అక్టోబరు నుంచి ప్రారంభం కానుంది. డెస్క్ ఆధారిత సిబ్బందికే ఇది వర్తించనుంది. ఈ అంశంపై ఇప్పటికే కంపెనీ బోర్డు, వర్క్ కౌన్సిల్ సభ్యుల మధ్య చర్చలు జరిగినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా బీఎండబ్ల్యూ కంపెనీకి 150,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల లాభాల మార్జిన్లు తగ్గడం, అమెరికా టారిఫ్‌లు, చైనా నుంచి ఎదురవుతున్న పోటీ కారణంగానే బీఎండబ్ల్యూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, వోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్ కంపెనీలు కూడా వ్యయాలు తగ్గించుకోవడానికి ఉద్యోగ కోతలను పరిశీలిస్తుండటం గమనార్హం.








# భారీ లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్, బ్యాంకింగ్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులూ కలిసొచ్చాయి. దీంతో సెన్సెక్స్ 888 పాయింట్లు ఎగబాకగా.. నిఫ్టీ 24,250 మార్కును చేరింది. సెన్సెక్స్ 888.68 పాయింట్ల లాభపడి 77,654.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 264.85 పాయింట్లు ఎగబాకి 24,250.20 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.64 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్, బీఈఎల్, ఎన్‌టీపీసీ షేర్లు తప్ప మిగతా స్టాక్స్ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 87.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ 4,031.84 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఏఐ రంగంలో ఇంతకాలం భారీగా పెట్టుబడులు పెట్టిన మదుపర్లు.. అక్కడ ఆశించిన స్థాయిలో ప్రతిఫలాలు రావేమోనని ఇప్పుడు ఐటీ స్టాక్స్‌వైపు మొగ్గుచూపుతున్నారు. నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు ఐటీ, బ్యాంకింగ్ షేర్లను కొనుగోలు చేశారు. విదేశీ పెట్టుబడిదారులు భారత్ మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది. మరోవైపు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరచాయి.



# ఐసీసీ ర్యాంకుల్లో టాపర్లు మనోళ్లే..

## టాప్ -50లో వైభవ్ సూర్యవంశీ

టీమ్ఇండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐసీసీ ర్యాంకుల్లో వేట మొదలుపెట్టాడు. ఇంగ్లాండ్‌పై అరంగేట్రం చేసిన అతడు.. ఆ టీ20 సిరీస్‌లో ప్రభావం చూపించలేదు. కానీ, జింబాబ్వేపై విజృంభించిన వైభవ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. మూడు వన్డేల్లో 151 పరుగులు చేశాడు. దీంతో ఐసీసీ ర్యాంకుల్లో దూసుకొచ్చాడు. ఏకంగా 230 స్థానాలను ఎగబాకడం గమనార్హం. దీంతో అనతికాలంలోనే వైభవ్ టాప్ -50లో అడుగు పెట్టాడు. ప్రస్తుతం 536 రేటింగ్ పాయింట్లతో 48వ స్థానంలో ఉన్నాడు. టీ20ల్లో అగ్రస్థానం భారత క్రికెటర్ ఇషాన్ కిషన్‌దే. అతడు 910 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఇంగ్లాండ్‌పై ఫర్వాలేదనిపించిన అభిషేక్ శర్మ జింబాబ్వేపై తేలిపోయాడు. దీంతో అతడి ర్యాంక్‌పైనా ప్రభావం పడింది. ఒక స్థానం కోల్పోయిన అభిషేక్ (819) మూడో ర్యాం కుకు పడిపోయాడు. పాకిస్థాన్ ఆటగాడు సహిబ్జాద ఫర్హాన్ (848) రెండో ర్యాంకుకు చేరాడు. తిలక్ వర్మ (750) రెండు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక టీ20 బౌలింగ్ విభాగంలో టాప్ -10లో భారత్ నుంచి ఒకే ఒక్క బౌలర్ మాత్రమే ఉన్నాడు. వరుణ్ చక్రవర్తి (663) మూడు స్థానాలను కోల్పోయినా 9వ ర్యాంకులో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా ఐదు స్థానాలను కోల్పోయాడు. ప్రస్తుతం 17వ ర్యాంకులో కొనసాగుతున్నాడు.

### వన్డేల్లో శుభ్‌మన్ గిల్ టాప్ ప్లేస్

వన్డే ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న కివీస్ ఆటగాడు డారిల్ మిచెల్ (794) రెండో స్థానానికి పడిపోయాడు. గిల్ ఖాతాలో ప్రస్తుతం 801 పాయింట్లు ఉన్నాయి. టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ (767), రోహిత్ శర్మ (758) వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. వన్డే బౌలింగ్ విభాగంలో భారత్ నుంచి టాప్-10లో ఒక్కరూ లేరు. కుల్‌దీప్ యాదవ్ (596) మాత్రం 11వ స్థానంలో ఉన్నాడు. ఇక జట్లపరంగా.. వన్డే, టీ20ల్లో టీమ్ఇండియా అగ్రస్థానంలో ఉంది. టెస్టుల్లో మాత్రం నాలుగో ర్యాంకులో నిలిచింది. టీ20ల్లోనూ ఇంగ్లాండ్ (268)తో భారత్ (268)కు తీవ్ర పోటీ తప్పడం లేదు.



# విండీస్ చేతిలో పాకిస్థాన్ చిత్తు

వెస్టిండీస్‌తో మొదటి టెస్టులో పాకిస్థాన్ కథ ముగిసింది. 211 పరుగుల లక్ష్య ఛేదనలో 120 పరుగులకే కుప్పకూలింది. దీంతో 90 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. మొత్తం 40 వికెట్లూ పేసర్లే తీయడం గమనార్హం. టెస్టు చరిత్రలో ఇలా ఒక మ్యాచ్‌లో అన్ని వికెట్లను పేసర్లే పడగొట్టడం ఇది ఆరోసారి మాత్రమే. ఇక పాక్‌పై విండీస్ పేసర్లు తొలిసారి 20 వికెట్లను తీశారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఏడు వికెట్లు తీసిన జస్టిన్ గ్రీవ్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో వెస్టిండీస్ 1-0 ఆధిక్యం సాధించింది. రెండో మ్యాచ్ పోర్ట్ ఆప్ స్పెయిన్ వేదికగా ఆగస్టు 2 నుంచి ప్రారంభం కానుంది.

### బాబర్ కాస్త పోరాడినా..

ఓవర్‌నైట్ 57/6 స్కోరుతో కష్టాల్లో ఉన్న పాకిస్థాన్‌ను కెప్టెన్ బాబర్ అజామ్ (58) కాస్త గట్టెక్కించే ప్రయత్నించాడు. హాఫ్ సెంచరీ సాధించాడు. కానీ, అతడికి మిడిలార్డర్ నుంచి సహకారం లభించలేదు. చివరి బ్యాటర్ మహమ్మద్ అబ్బాస్ (23)తో కలిసి కాసేపు పోరాడిన బాబర్ నాటౌట్‌గా మాత్రమే మిగిలాడు. దీంతో పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే ఆలౌటైంది. జైడెన్ సీలెస్ ఐదు వికెట్ల (5/20) ప్రదర్శనతో పాక్‌ను దెబ్బకొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 311 పరుగులు చేయగా.. పాక్ 282 రన్స్‌కే పరిమితమైంది. అనంతరం వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి పాక్ ఎదుట 211 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. కానీ, పాక్ బ్యాటర్ల పేలవ ఆటతో 120 రన్స్‌కే కుప్పకూలి ఓటమిపాలైంది.

# ఐపీఎల్ బిజినెస్ విలువ 20 బిలియన్ డాలర్లు

## టాప్ బ్రాండ్‌గా ఆర్సీబీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ విలువ తొలిసారి 20 బిలియన్ డాలర్ల (1.9 లక్షల కోట్లు) మార్క్‌ను దాటేసింది. అదే విధంగా ఐపీఎల్‌లో టాప్ బ్రాండ్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. వరుసగా రెండు సీజన్లలో కప్పును సొంతం చేసుకున్న ఆర్సీబీ తన మార్కెట్‌ను పెంచుకుంది. ప్రస్తుతం ఆర్సీబీ విలువ 300 మిలియన్ డాలర్లకుపైగా ఉంది. 2026లో ఐపీఎల్ విలువను హౌలిహాన్ లోకీ స్టడీ చేసి నివేదికను విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే లీగ్ బిజినెస్ విలువ 11.4 శాతం పెరిగినట్లు పేర్కొంది. మూడేళ్ల కిందట ఐపీఎల్ బిజినెస్ విలువ 15.4 బిలియన్ డాలర్లు (రూ. 1.47 లక్షల కోట్లు) ఉండేది. 2024నాటికి 16.4 బిలియన్ డాలర్లు (రూ. 1.56 లక్షల కోట్లు)కి విలువ పెరిగింది. 2025 నాటికి 18.5 బిలియన్ డాలర్లు (రూ. 1.75 లక్షల కోట్లు) ఈ ఏడాది ఐపీఎల్ బిజినెల్ విలువ 20.6 బిలియన్ డాలర్లు (రూ. 1.90 లక్షల కోట్లు)కు పెరిగింది. మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ల విక్రయాలు కలిపి మొత్తం ఆదాయం 1.8 బిలియన్ డాలర్లు (రూ. 1.70 లక్షల కోట్లు) దాటుందని నివేదిక అంచనా వేసింది.

### ఒక్కో ఐపీఎల్ టీమ్ బ్రాండ్ విలువ ఎంతంటే?

- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: 312 మిలియన్ డాలర్లు (రూ. 2,984 కోట్లు)
- ముంబయి ఇండియన్స్: 264 మిలియన్ డాలర్లు (రూ. 2,525 కోట్లు)
- కోల్‌కతా నైట్‌రైడర్స్: 245 మిలియన్ డాలర్లు (రూ. 2,348 కోట్లు)
- చెన్నై సూపర్ కింగ్స్: 244 మిలియన్ డాలర్లు (రూ. 2,334 కోట్లు)
- సన్‌రైజర్స్ హైదరాబాద్: 168 మిలియన్ డాలర్లు (రూ. 1,600 కోట్లు)
- రాజస్థాన్ రాయల్స్: 161 మిలియన్ డాలర్లు (రూ. 1,540 కోట్లు)
- పంజాబ్ కింగ్స్: 158 మిలియన్ డాలర్లు (రూ. 1,514 కోట్లు)
- గుజరాత్ టైటాన్స్: 157 మిలియన్ డాలర్లు (రూ. 1,501 కోట్లు)
- దిల్లీ క్యాపిటల్స్: 156 మిలియన్ డాలర్లు (రూ. 1,492 కోట్లు)
- లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ : 122 మిలియన్ డాలర్లు (రూ. 1,168 కోట్లు)

# వరల్డ్ కప్ స్ట్రక్చర్ మారింది.. మా జట్టు సభ్యులను పెంచండి

## ఆస్ట్రేలియా కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్



గత ఎడిషన్‌తో పోలిస్తే వన్డే ప్రపంచ కప్ 2027 స్ట్రక్చర్‌ను ఐసీసీ మార్చిన సంగతి తెలిసిందే. ఈసారి 14 టీమ్‌లు బరిలోకి దిగుతున్నాయి. అయితే, గ్రూప్ స్టేజ్‌లో 12 టీమ్‌లు తలపడతాయి. ఆ తర్వాత సూపర్ -7 రౌండ్ జరగనుంది. ఈ క్రమంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా జట్టు కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ ఓ కీలక ప్రతిపాదనను తీసుకొచ్చాడు. ఆడే మ్యాచులు పెరిగే అవకాశం ఉన్నందున తమ స్క్వాడ్‌లోని ప్లేయర్ల సంఖ్యనూ పెంచుకొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశాడు. "ఒకవేళ మీకు వన్డే ప్రపంచ కప్ అత్యంత కీలకమైన ఈవెంట్ అయితే.. బరిలోకి దిగే జట్ల పరిమాణాలు ఎలా ఉండాలని అనుకుంటున్నారు? గత వన్డే ప్రపంచ కప్‌లో మేం 15 మంది స్క్వాడ్‌ను ఆడించాం. వచ్చే వరల్డ్ కప్‌లోనూ అలానే ఆడిస్తారా? లేదా? ఏదైనా మార్పులు చేస్తారా? అనే సందిగ్ధతలో ఉన్నాం. ఈసారి స్ట్రక్చర్ మారింది. గత ఎడిషన్‌లో న్యూజిలాండ్‌లా మేం కూడా గాయాలతో ఇబ్బంది పడ్డాం. లీగ్ స్టేజ్ సమయంలోనే తుది జట్టు ఎంపిక కోసం 12 లేదా 13 మంది మాత్రమే అందుబాటులో ఉన్న పరిస్థితిని చూశాం. దీని వల్ల అనుకున్న విధంగా తుది జట్టులో మార్పులు చేసేందుకూ వీలుపడలేదు. ఇప్పుడు విభిన్నమైన ప్రాంతాల్లో మ్యాచులు జరుగుతున్నాయి. మా వాతావరణానికి అక్కడి పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అప్పుడు గాయాల సమస్య ఇంకాస్త తీవ్రంగా మారే ప్రమాదం ఉంది. ఇలాంటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే స్క్వాడ్‌లో ఆటగాళ్ల సంఖ్యను కాస్త పెంచాలి" అని మెక్‌డొనాల్డ్ వ్యాఖ్యానించాడు. గత వన్డే ప్రపంచ కప్‌లో గ్రూప్ స్టేజ్ మ్యాచులకు గాయం కారణంగా ట్రావిస్ హెడ్ అందుబాటులో లేడు. టోర్నీ మధ్యలోనే వైద్యబృందం ఫిట్‌నెస్ ధ్రువీకరణ చేస్తుందనే ఉద్దేశంతో మరొకరిని భర్తీ చేయలేదు. ఫిట్‌గా ఉన్న 14 మందినే లీగ్ స్టేజ్‌లో ఆడించింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఎవరైనా ఆటగాడు 15 మంది సభ్యుల జాబితాలో ఉండి.. గాయం కారణంగా వైదొలిగితే ఆ స్థానాన్ని భర్తీ చేయాలంటే ఐసీసీ సాంకేతిక కమిటీ ఆమోదం ఇవ్వాల్సిందే. అందుకు తగిన కారణం చూపించాలి. తొలుత తప్పించి.. మళ్లీ జట్టులోకి తీసుకోవడం సాధ్యం కాదు.

# సారాంశ్ జైన్ తుది జట్టులో ఉంటాడు

## అతడు భిన్నమైన ఆఫ్ స్పిన్నర్: అశ్విన్



శ్రీలంకతో టెస్టు సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ కొత్త స్పిన్నర్‌ను తీసుకొచ్చింది. 33 ఏళ్ల సారాంశ్ జైన్‌ను ఎంపిక చేయడంతో.. అందరి దృష్టి ఇప్పుడు అతడిపై పడింది. అతడు భిన్నమైన ఆఫ్ స్పిన్నర్ అని.. శ్రీలంకతో టెస్టుల్లో తప్పకుండా తుది జట్టులో ఉంటాడని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వెల్లడించాడు. అలాగే తన ప్లేయింగ్ 11 ఏంటో కూడా ప్రకటించాడు. గతంలో వైభవ్ సూర్యవంశీ విషయంలో తాను ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై వివరణ ఇచ్చాడు. "శ్రీలంకతో తొలి టెస్టులో తప్పకుండా రవీంద్ర జడేజా ఆడతాడు. గత మ్యాచ్‌లో ఏడు వికెట్లు తీసిన మానవ్ సుతార్‌కూ అవకాశం ఉంది. ఇక కుల్‌దీప్ కూడా ఆడాలి. ఇప్పటికే ముగ్గురు స్పిన్నర్లు అవుతారు. ఇక సారాంశ్ జైన్‌ను ఏడో స్థానంలో తీసుకోవడం ఖాయమే. అతడు భిన్నమైన ఆఫ్ స్పిన్నర్. బ్యాటర్‌గానూ పరుగులు చేయగలడు. రిషభ్ పంత్ ఐదు, శుభ్‌మన్ గిల్ నాలుగు, దేవదత్ పడిక్కల్ లేదా సాయి సుదర్శన్‌లో ఒకరు మూడో స్థానంలో బరిలోకి దిగుతారు. యశస్వి జైస్వాల్ - కేఎల్ రాహుల్ జోడీ ప్రారంభిస్తుంది. సాయి సుదర్శన్, జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది. ఫాస్ట్ బౌలర్ల కోసం రెండు స్లాట్‌లు ఉంటాయి. సాయి సుదర్శన్ లేకపోవడం భారత్‌కు లోటే. అతడి గైర్హాజరీలో దేవదత్ పడిక్కల్ ఆడతాడు. దేశవాళీలో మంచి ప్రదర్శనే ఇచ్చాడు. కానీ, ఫస్ట్ ఛాయిస్ మాత్రం సాయి సుదర్శనే" అని అశ్విన్ వెల్లడించాడు.



# యాపిల్ అప్‌గ్రేడ్ ప్లాన్..

## ఇక నెలవారీ అద్దె చెల్లింపులు

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ తన మ్యాక్‌బుక్, ఐప్యాడ్ ధరలను ఇటీవలే భారీగా పెంచింది. తాజాగా ఐఫోన్ ధరల పెంపు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. దీంతో సాధారణ వ్యక్తి ఐఫోన్ కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. అయితే, వినియోగదారులకు ఊరటనిచ్చేలా యాపిల్ ఓ కొత్త ప్లాన్ తీసుకొచ్చింది. యాపిల్ అప్‌గ్రేడ్ పేరిట డివైజ్ లీజింగ్ ప్రోగ్రామ్‌ను లాంచ్ చేసింది. అంటే ఎంపిక చేసిన కంపెనీ ఉత్పత్తులను లీజ్‌కు తీసుకోవాలంటే.. నెలవారీ ప్రాతిపదికన కొంత మొత్తాన్ని అద్దె రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన ఐఫోన్, యాపిల్ వాచ్ కొనుగోలుపై ఒకేసారి పూర్తి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. 12 నెలలు, 24 నెలలు లేదా 36 నెలల వ్యవధిలో వాయిదాల పద్ధతిలో కొంత అద్దె చెల్లించాలి. యాపిల్ కార్డు హోల్డర్స్‌కు 3 శాతం క్యాష్‌బ్యాక్ ఉంటుందని కంపెనీ పేర్కొంది. లీజు గడువు ముగిశాక.. వినియోగదారులు మిగిలిన మొత్తాన్ని చెల్లించి సదరు డివైజ్‌లను సొంతం చేసుకోవచ్చు. లేదంటే ఆ డివైజ్‌లను కంపెనీకి ఇచ్చేసి లీజు నుంచి తప్పుకోవచ్చు. లేదా ఆ పరికరాన్ని ఇచ్చేసి కొత్త మోడల్ కోసం మరో ఒప్పందాన్ని కుదుర్చుకోవచ్చు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో లేదా యాపిల్ స్టోర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దరఖాస్తుదారులకు సాఫ్ట్ క్రెడిట్ ఎంక్వైరీని తప్పనిసరి చేసింది. ఐఫోన్17 మోడళ్లు, యాపిల్ వాచ్ సిరీస్11, అల్ట్రా 3, మ్యాక్‌బుక్ ఎయిర్ ఎం5 చిప్, ఐప్యాడ్ ఎయిర్ ఉత్పత్తులపై ఆఫర్లు అందిస్తోంది. ఎంపిక చేసిన మోడళ్లపై నెలకు 11.99 డాలర్ల నుంచి 24.99 డాలర్ల మధ్య అద్దె ధరలు నిర్ణయించింది. (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1148 నుంచి రూ.2400) ఈ ప్లాన్‌ను ప్రస్తుతం అమెరికాలో తీసుకొచ్చింది. దశలవారీగా భారత్‌లోనూ విస్తరించే అవకాశం ఉంది.



# ఆర్‌బీఐ బంగారు నిల్వలు 880 టన్నులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద 880.52 టన్నుల బంగారు నిల్వలున్నాయి. 2025 మార్చి 31తో పోలిస్తే, 2026 మార్చి 31 నాటికి 0.94 టన్నుల పసిడి నిల్వలే పెరిగినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధ్రీ రాజ్యసభకు తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఇదే కనిష్ఠ వృద్ధి అని తెలిపారు. విదేశీ మదుపర్లు లాభాలు స్వీకరించడంతో పాటు ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఓడీఐ) బయటకు వెళ్లడం వల్లే ఇటీవలి కాలంలో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గాయని ప్రభుత్వం తెలిపింది. 2022-23లో నికర ఎఫ్‌డీఐలు 27.99 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2025-26 నాటికి 6.95 బిలియన్ డాలర్ల (అప్పటి మారకపు విలువ ప్రకారం రూ. 62,550 కోట్ల)కు పరిమితమయ్యాయని ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ తెలిపారు. 2023-24లో 10.13 బి.డాలర్లకు, 2024-25లో 960 మి.డాలర్లకు ఇవి చేరాయన్నారు. స్థూలంగా చూస్తే 2025-26లో 94.84 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. 2024-25లో ఇవి 80.61 బి.డాలర్లుగా ఉన్నాయి. విదేశాల్లో తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి భారతీయ కంపెనీలకు వీలు కల్పిస్తూ 2022లో ఓడీఐ నిబంధనలను సరళీకరించడం వల్ల ఉపసంహరణలు పెరిగాయని ఆయన వివరించారు. డాలరుతో పోలిస్తే రూపాయి నెలవారీ సగటు మారకపు విలువ 2014 మేలో రూ. 59.3గా, 2026 మే లో రూ. 95.6గా ఉందని వివరించారు.

జనం వార్త


# రిషబ్ శెట్టికి ఐఎఫ్‌ఎఫ్‌ఎం 'లీడర్‌షిప్ ఇన్ సినిమా' అవార్డ్



'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి. తాజాగా ఆయనకు అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియాలోని 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' 2026లో 'లీడర్‌షిప్ ఇన్ సినిమా' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఆగస్టు 13న మెల్‌బోర్న్‌లో జరిగే వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాన్ని అందుకోనున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కథలను ప్రపంచానికి చాటిచెప్పినందుకు ఐఎఫ్‌ఎఫ్‌ఎం ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల రిషబ్ ఆనందం వ్యక్తం చేశారు. "ఈ అవార్డుకు ఎంపికకావడం ఎంతో గర్వంగా భావిస్తున్నాను. సంస్కృతి, సంప్రదాయాలను చూపి ంచడానికి నేను ఎప్పుడూ కథలనే మార్గంగా ఎంచుకుంటాను. మన మూలాలకు సంబంధించిన కథలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరడం ఎంతో సంతోషా న్నిస్తోంది. మెల్‌బోర్న్ వేడుకల్లో తోటి సినీ ప్రముఖులు, ప్రేక్షకులతో కలిసి పాల్గొనేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని పేర్కొన్నారు.

# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్

యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.




# రెండు భాగాలుగా రాకా మూవీ

## వేయికోట్ల బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# ఆత్మవిశ్వాసం మాత్రమే కొండంత అండ

**- కాయదు లోహర్**



కోలీవుడ్ యంగ్ బ్యూటీ కాయదు లోహర్ ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఊహించని క్రేజ్ రాబట్టుకున్నారు. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో వరుస ఆఫర్లు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌ల సరసన చేరేందుకు వేగంగా దూసుకుపోతున్నారు. ఇటీవల ఇదయమ్ మురళి, పళ్లిచట్టంబి వంటి చిత్రాలతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న ఈ భామ, ఇప్పుడు తెలుగులో 'ది ప్యారడైజ్', తమిళంలో 'ఇమ్మోర్టల్' వంటి భారీ ప్రాజెక్టులలో నటిస్తున్నారు. వీటితో పాటు మలయాళంలో 'ఐయామ్ గేమ్', 'సూర్య-48' వంటి ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లతో నిరంతరం బిజీగా గడుపుతున్నారు. ఈ వరుస సినిమాల సందడి మధ్య ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కాయదు లోహర్, తన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలతో పాటు తనలోని బలాలు, బలహీనతల గురించి పలు విషయాలు పంచుకున్నారు. తన నమ్మకమే తన అతిపెద్ద బలమని కాయదు తెలిపారు. జీవితంలో ఎదురైన ఎన్నో కష్ట సమయాల్లో,క్లిష్ట పరిస్థితుల్లో తనలో ఉన్న ఆత్మవిశ్వాసం మాత్రమే తనకు కొండంత అండగా నిలిచిందని చెప్పారు. అదే సమయంలో తనలోని పెద్ద బలహీనత గురించి కూడా ఆమె ఓపెన్‌గా మాట్లాడారు. తాను మనుషులను చాలా త్వరగా నమ్మేస్తానని, ఎవరినైనా సులభంగా నమ్మి మోసపోతానని, అదే తన అతిపెద్ద బలహీనత అని స్పష్టం చేశారు. ఈ బలహీనత కారణంగానే తన జీవితంలో చాలాసార్లు మోసపోయానని, మానసికంగా, వ్యక్తిగతంగా తీవ్రమైన నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటిగా సినీ రంగంలో ఎంతో ఎత్తుకు ఎదుగుతున్నప్పటికీ, ఇతరులను గుడ్డిగా నమ్మేసే స్వభావం వల్ల తాను అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నానని కాయదు లోహర్ వివరించారు. ప్రస్తుతం కెరీర్ పరంగా ఎంతో బిజీగా ఉన్న ఈ భామ, వ్యక్తిగత జీవితంలో నేర్చుకున్న పాఠాలు తనను మరింత బలంగా మార్చాయని అన్నారు.

# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు

## దర్శకుడిగా తరుణ్ భాస్కర్‌కు హిట్

## నటులుగా విజయ్ దేవరకొండ, రీతూవర్మలకు గుర్తింపు



తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందుకూరి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన, సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు.బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్మాత్మక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు కూడా ప్రకటించబడ్డాయి. ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో కూడా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది.




# చకచకా స్పిరిట్ షూటింగ్

## వందరోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్పిరిట్' గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్టుల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, 'స్పిరిట్' టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బ్జడెట్ సినిమాలతో పోలిస్తే 'స్పిరిట్' అత్యంత తక్కువ బ్జడెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఆదర్శకుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర పరిచయం




విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ కూతురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌జీ కూతురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభా షణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com